# ఘనంగా రక్షాబంధన్

- అన్నదమ్ములకు రాఖీలు కట్టిన సోదరీమణులు
- కానుకలను అందజేసిన అన్నదమ్ముళ్లు
- బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ



లింగంపేట కస్తూర్బా గురుకుల పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 19: అక్కా తమ్ముడు, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమిని రాఖీ పౌర్ణమి, జంధ్యాల పూర్ణిమగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. పండుగ సందర్భంగా సోదరులకు రాఖీలను కట్టిన సోదరీమణులు వారిని మనసారా దీవించారు. అన్నాదమ్ములు ఇచ్చే కట్నకానుకలను స్వీకరించారు. అందరూ కలిసి పిండివంటలు, తీపి పదార్థాలు ఆరగించారు. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల వద్దకు సోదరులు, సోదరీమణులు వచ్చి రాఖీలు కట్టారు. పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్లు, బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏర్పడింది. రాఖీ దుకాణాల వద్ద సందడి నెలకొన్నది. కామారెడ్డిలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ఆయన నివాసంలో, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ తన సోదరుడు బాలాజీ రావుకు రాఖీ కట్టారు. బాన్సువాడలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి ఆయన అక్క దొడ్ల సత్యవ్వ రాఖీ కట్టి స్వీటు తినిపించి, ఆశీర్వదించారు. బాన్సువాడలోని భక్త మార్కండేయ మందిరంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాఖీ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పాల్గొన్నారు. తెలంగాణ విశ్వ విద్యాలయం దక్షిణ ప్రాంగణంలో వృక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణ, అంజయ్య, మోహన్‌బాబు యాలాద్రి, ఈకో క్లబ్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సౌత్ క్యాంపస్‌లో చెట్టుకు రాఖీ కడుతున్న సిబ్బంది



బీర్కూర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో..



మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు



కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారానికి రాఖీ కడుతున్న అక్క దొడ్ల సత్యవ్వ



ఉప్పల్‌వాయి గురుకుల వసతి గృహంలో..



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

## హాస్టళ్లలో మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేపట్టాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 19 : వసతి గృహాల్లో మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గవర్నమెంట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లోని వసతి గృహాలను మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేపట్టాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వసతి గృహాల్లో పరిసరాలు శుభ్రంగా ఉండేలా, పిచ్చి మొక్కలు లేకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్,డీపీవో శ్రీనివాసరావు, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కనువిందు చేస్తున్న అమర్‌నాథ్ శివలింగం



రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన అమర్‌నాథ్ శివలింగం

కామారెడ్డి, ఆగస్టు 19 : ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలో విద్యానగర్‌లోని రోటరీ క్లబ్‌లో ఈ నెల 16వ తేదీన అమర్‌నాథ్ శివలింగాన్ని ఏర్పాటు చేశారు. ఈ శివలింగాన్ని దర్శనం చేసుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అమర్‌నాథ్ వెళ్లలేని వారు ఈ అమర్‌నాథ్ శివలింగాన్ని దర్శనం చేసుకుంటున్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు జయదీదీ, బీకే.గంగ, లలిత, సంతోషి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధారిలో వరల్డ్ ఫొటోగ్రఫీ డే



డాగ్యురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

గాంధారి, ఆగస్టు 19: వరల్డ్ ఫొటోగ్రఫీ డేను గాంధారిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫొటోకెమెరా సృష్టికర్త లూయిస్ జకాస్ మండేడాగ్యురే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు హరాలే సురేశ్‌రావు, నల్లగారి నవీన్, హరాలే రమేశ్, కమ్మరి సంతోష్, శేఖర్, అనూఖ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద



నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు

నిజాంసాగర్, ఆగస్టు 19: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతున్నదని ప్రాజెక్టు ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టులోకి సోమవారం 1500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగుల(17.802టీఎంసీల)కు గాను ప్రస్తుతం 1390.50 అడుగుల(4.251టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.

## ఆహ్లాదాన్ని పంచుతున్న అవెన్యూ ప్లాంటేషన్



కేసీఆర్ పాలనలో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అవి రోడ్డు వెంట వెళ్లేవారికి చల్లదనంతోపాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గాంధారి నుంచి తిప్పారం గ్రామానికి వెళ్లే దారిలో నాలుగు ఏండ్ల క్రితం ఈదుల్లా వాగు నుంచి తిప్పారం గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. వరుసగా ఉన్న రకరకాల చెట్లు ప్రస్తుతం పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి.

- గాంధారి, ఆగస్టు 19

## 'రెచ్చగొట్టేలా మెసేజ్‌లు చేస్తే కఠిన చర్యలు'

కామారెడ్డి, ఆగస్టు 19 : ఈ మధ్య ఎక్కువగా సోషల్ మీడియాలో కుల మతాలకు సంబంధించిన విషయాలు, ఏదో వర్గాన్ని రెచ్చగొట్టేలా, అవమానపరిచేలా, ఏదో ఒక వ్యక్తిని టార్గెట్ చేసేలా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో మెసేజ్‌లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో కుల మతాలను కించపరిచేలా పోస్టులు, ఫొటోలు, వీడియోలను పెట్టకూడదని అన్నారు. ఒక వేళ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాట్సాప్ గ్రూప్‌ల్లో రెచ్చగొట్టేలా మెసేజ్‌లు చేయద్దని సూచించారు. అలాంటి వారిని గ్రూప్ అడ్మిన్లు వారి గ్రూప్‌ను ప్రతిక్షణం పరిశీలించాలని సూచించారు.

## నేడు వాహనాల వేలం

కామారెడ్డి, ఆగస్టు 19 : కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి హన్మంత్‌రావు ఆదేశాల మేరకు కామారెడ్డి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు డీడీ చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి వాహనంపై 18 శాతం జీఎస్టీ ఉంటుందని తెలిపారు.

## తహసీల్దార్ ఎదుట వ్యక్తి బైండోవర్

మాచారెడ్డి, ఆగస్టు 19 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన యేరిగే చందు మద్యం తాగి ప్రతి రోజూ పదుల సంఖ్యలో 'డయల్ 100'కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేస్తున్నాడని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేసి సేవలని వినియోగించుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-All
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## చర్యలు తీసుకోవాలని వినతి

బాన్సువాడ, ఆగస్టు 19 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని బాన్సువాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్లు బాదావత్ దస్రు, గైని శంకర్ ఎస్‌హెచ్‌వో కృష్ణకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీపుకోవాలని కోరారు. కొత్తబాదీ, దామరంచకు చెందిన ట్రాక్టర్ యజమానులు ఎలాం టి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని కానిస్టేబుళ్లు తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారని పట్టణ ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## మొబైల్ ఫోన్ అందజేత



బాధితుడికి మొబైల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై అనిల్

మాచారెడ్డి, ఆగస్టు 19 : మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన నుకల మహేశ్ ఇటీవల తనఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడికి పోలీస్ స్టేషన్‌లో సోమవారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందకుండా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఎంపీడీవో కార్యాలయం వద్ద కోతుల బెడద



ఎంపీడీవో కార్యాలయం వద్ద తిరుగుతున్న కోతులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 19: నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద కోతుల బెడదతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంతోపాటు ఉపాధి హామీ, తహసీల్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలపై కోతులు దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. అధికారులు, ప్రజలు చేతిలో కర్ర లేకుండా బయటికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ కోతుల గుంపులు సంచరిస్తున్నాయి. వాటికమే దాడి చేసుకుంటూ.. అటుగా వెళ్తున్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పోలీస్‌స్టేషన్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. స్టేషన్ వద్ద కోతుల గుంపు ఉండడంతో లోనికి వెళ్లడానికి పోలీసు సిబ్బందితోపాటు ప్రజలు భయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## భౌ..బోయ్ కుక్కలు..!

నాగిరెడ్డిపేట, ఆగస్టు19: నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో రాత్రి అయ్యిందంటే.. ప్రజలు బయటికి రావడానికి భయపడుతున్నారు. గోపాల్‌పేట బస్టాండ్, పెట్రోల్ పంపు, జేఎస్‌ఎం దవాఖాన సమీపంలో రోడ్డుపై నిత్యం రాత్రివేళ కుక్కలు గుంపులుగా చేరుతున్నాయి. రోడ్డుపై వెళ్లున్నవారిపై దాడి చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఆరుగురు వ్యక్తులను కుక్కలు గాయపర్చగా.. వారు చికిత్స పొందుతున్నారు. బైకులపై వెళ్తున్న వారిని కూడా వెంబడించి కరుస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల భారి నుంచి తమను కాపాడాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్కన రాత్రి 11 గంటల సమయంలో నిద్రిస్తున్న కుక్కల గుంపు

## రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, ఆగస్టు 19: మండలంలోని ఆయా గ్రామాల అన్నదాతలు మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వానకాలంలో సాగు చేసే పంటల సస్యరక్షణ చర్యలు, చీడ పీడల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆన్‌లైన్‌లో సలహాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పలువురు ఏఈవోలు బదిలీ

రామారెడ్డి, ఆగస్టు 19: సదాశివనగర్ మండలంలోని పలు క్లస్టర్లలో పని చేస్తున్న ఏఈవోలు బదిలీ అయ్యారని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి సోమవారం తెలిపారు. అడ్లూర్ ఎల్లారెడ్డి, ఉత్తునూర్, లింగుపల్లి నుంచి శిరీష, శ్రీనివాస్‌రెడ్డి, హారిక బదిలీ అయ్యారని పేర్కొన్నారు. వారి స్థానంలో ప్రణీత, కళ్యాణి, గాయిత్రి బదిలీపై వచ్చి బాధ్యతలను చేపట్టారని తెలిపారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ



ఎల్లారెడ్డిలో విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 19: రాష్ట్ర రాజధానిలోని కుకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడైన సంతోష్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎల్లారెడ్డిలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదిపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిని పోలీసులు చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో న్యాయవాదులు గోపాల్‌రావు, పద్మ పండరి, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

నస్రుల్లాబాద్, ఆగస్టు 19 : శ్రావన మాసం సోమవారం సందర్భంగా శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. నస్రుల్లాబాద్ మండలం మైలారం రాజరాజేశ్వర, దుర్కి సోమలింగేశ్వర, బీర్కూర్ శివారులోని జోడులింగేశ్వర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

**ఆలయంలో అన్నదానం**

రాజంపేట్, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి కాచాపురం గౌరినాథ్ శర్మ కుటుంబ సభ్యులు అన్నదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్న సిద్ధిరాములు, వైస్ చైర్మన్ శంకర్, సభ్యులు పటేల్ సత్యం రెడ్డి, బందం కృష్ణమూర్తి, కామిశెట్టి వీరన్న పటేల్, శ్రీరాం, సురేశ్, అముదాల రమేశ్, రాజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన స్వాతికి సన్మానం

బీబీపేట్, ఆగస్టు 19: మండల కేంద్రానికి చెందిన తంగలపల్లి స్వాతి తెలంగాణ విశ్వవిద్యాలయంలో పీ.జీ (కెమిస్ట్రీలో) డాక్టరేట్ సాధించింది. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. శివకుమార్, రామాగౌడ్, వెంకటేశ్, నిఖిల్, నందు, చందు, సంతోష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.